క్లుప్తంగా

'పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయండి'



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ఏబీఎస్‌ఎఫ్, స్వేరోస్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు బొట్ల నరేశ్, శనిగరపు రాజేంద్రప్రసాద్ సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, ప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సైకిళ్ల అందజేత



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం హైస్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ కేబిన్ డైరెక్టర్ మహ్మద్ రఫీ గురువారం సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీందర్ మాట్లాడారు. ఎంపవరింగ్ గర్ల్ స్టూడెంట్ విత్ బైస్కిల్స్‌లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థినిలకు ఉపాధ్యాయుడు పెరుగు శ్రీనివాస్ సూచన మేరకు సైకిళ్లు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయప్రకాశ్, శ్రీదేవి, రమేశ్, నాగమణి, అశోక్, జాహెద్ అలీ పాల్గొన్నారు.

సన్మానం



గీసుకొండ : మండలంలోని మనుగొండ యూపీహెచ్‌సీ ఎస్‌జీటీ శైలజాదేవిని ఉద్యోగ విరమణ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన వీడ్కోలు సభకు శ్రీపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని చెప్పారు. శైలజాదేవి నిబద్ధతతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సాంబయ్య, పీఆర్‌టీయూ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీహరి, హెచ్‌ఎంలు పట్టాభి, రజాక్, రవీందర్, ఏఏసీసీ చైర్‌పర్సన్ స్రవంతి పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

చెన్నారావుపేట: పాపయ్యపేటలో గుప్త నిధుల కోసం కొందరు తవ్వకాలు చేపట్టడం కలకలం రేపింది. ధర్మారావుపేటకు వెళ్లే దారిలోని వ్యవసాయ బావి వద్ద ఓ రాజకీయ నాయకుడి అండతోనే వారు తవ్వకాలు చేపట్టినట్లు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. నిమ్మకాయలు, గుమ్మడికాయలు, పసుపు, కుంకుమ వేసి పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. జంతుబలి, నరబలి ఇవ్వడానికి కూడా సిద్ధపడినట్లు సమాచారం. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

పర్వతగిరి : నర్సంపేటలో నేటి (శుక్రవారం) నుంచి రెండ్రోజులపాటు సీపీఎం జిల్లా 20వ మహాసభలు నిర్వహిస్తామని ఆ పార్టీ మండల కార్యదర్శి మాదాసి యాకూబ్ తెలిపారు. మండల కేంద్రంలో జిల్లా రమేశ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేలా అనేక పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణకు రూపకల్పన చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పోడేటి దయాకర్, ఆబర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'దీక్షా దివస్'

రాయపర్తి : వరంగల్‌లోని నాని గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) ఉదయం 10 గంటలకు దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూడావత్ నర్సింహ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. దీక్షా దివస్‌కు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, భద్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కల్లాలు లేక రైతుల కష్టాలు

- రోడ్లు, క్రీడా ప్రాంగణాల్లోనే ఆరబోత
- భూమి కేటాయించాలని రైతుల వేడుకోలు

సంగెం : గ్రామాల్లో కల్లాలు లేకపోవడంతో పండించిన ధాన్యం ఆరబోసుకునేందుకు రైతులు కష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మద్దతు ధర మీద రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. గవిచర్ల, మొండ్రాయి, లోహిత, షాపూర్, సంగెం, ఎల్గూర్ రంగంపేట, తదితర గ్రామాల్లోని ప్రయివేట్ స్థలాలను రైతులు ఆశ్రయిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు అందుబాటులో లేవు, పంట పొలాల్లో రబీ పంటలు సాగు చేస్తుండంతో ధాన్యం ఆరబోయడానికి స్థలాభావం ఏర్పడింది. పలు గ్రామాల్లో రహదారులను, క్రీడా ప్రాంగణాల మీదే ధాన్యాన్ని ఆరబోస్తున్న పరిస్థితి కనపడుతోంది. దీంతో రోడ్లపైన వాహనచోదకులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటాలు కావడం లేదని రైతులు వేదనకు గురవుతున్నారు. తాలు, తేమ ఉందంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇబ్బంది పెడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యం మళ్లీ ఆరబోయాల్సి వస్తోందని పలువురు రైతులు తెలిపారు. గ్రామాల్లో వరి ధాన్యం ఆరబోసే దిశగా కల్లాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని రైతులు కోరుతున్నారు.



సంగెం : చింతలపల్లిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం



తీగరాజుపల్లిలోని క్రీడాప్రాంగణంలో..

ధాన్యం కోతలపై చర్యలు తప్పవు

- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

దుగ్గొండి : తాలు, తేమ పేరుతో ధాన్యం కొనుగోలులో కోతలు పెడితే చర్యలు తప్పవని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని నాచినపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తీసుకొస్తున్న ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. క్వింటా ధాన్యానికి ప్రభుత్వం రూ.2320 మద్దతు ధర చెల్లించడంతోపాటు సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ కలిపి చెల్లిస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం సేకరించే క్రమంలో కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కిరణ్‌రెడ్డి, నర్సింగరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దంజ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

'కొనుగోలులో నిర్లక్ష్యం సరికాదు'

నర్సంపేట : ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం సరికాదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను ఆమె ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుపై ఆమె మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డితో మాట్లాడింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అనంతరం కార్యదర్శి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా అధ్యక్షుడు మాశుక్, నాయకులు బైరబోయిన నర్సయ్య, గణిపాక బిందు, పాషా, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



మెట్ల పూజ చేస్తున్న గురుస్వాములు

నర్సంపేట : పట్టణంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయంలో గురువారం పడిపూజ వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి, అయ్యప్ప స్వామి, కుమార స్వామి చిత్రపటాలను అలంకరించారు. అయ్యప్ప స్వామికి 16 రకాల పదార్థాలతో అభిషేకం చేశారు. ఆలయంలో 18 మెట్లు ఏర్పాటు చేసి పూజించారు. స్వామియే శరణం అయ్యప్ప అన్న మాలదారులు, భక్తుల శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకులు, గురుస్వాములు పడి పూజ నిర్వహించారు. గర్నెపల్లి కృష్ణమూర్తి కుమారులు శ్రీనివాస్, విజయలక్ష్మి, నరహరి, స్వాతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, అభ్యాస్ స్కూల్ నిర్వాహకులు పుల్లూరి పద్మ సదానందం, శ్రీరాం మౌనిక, శ్రీకాంత్ స్వామి వారి అభిషేకంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పర్వతగిరి : గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, తదితరులు



పూలే ఆశయాలను కొనసాగించాలి

సాక్షి నెట్‌వర్క్ : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, దుగ్గొండి, రాయపర్తి, పర్వతగిరి, తదితర మండలాల్లో జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పూలే చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే అందించిన సేవలను స్మరించారు. పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండలో ట్రస్ట్ ఆధ్వర్యంలో గటిక మల్లయ్య ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్‌నాయక్ ప్రారంభించి మాట్లాడారు.



వర్ధన్నపేట : నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- బీజేపీ జిల్లా కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక హామీలతో రైతులను, కార్మికులను, ఉద్యోగులను, అన్ని వర్గాల ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాదిగా మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలులోనూ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా డిసెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన యాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వడ్డేపల్లి నర్సింహారావు, కంభంపాటి పుల్లారావు, రేసు శ్రీనివాస్, రత్నం సతీశ్, జలగం రంజిత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలను ఆదుకుంటాం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

వర్ధన్నపేట : సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలను ఆదుకుంటామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చెన్నారం, ఇల్లంద, కట్ర్యాల, నల్లబెల్లి, రాంధన్ తండా, ల్యాబర్తి, దమ్మన్నపేట, అంబేడ్కర్ నగర్‌కు చెందిన పలువురికి గురువారం వారు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి, సత్యనారాయణ మాట్లాడారు. పేదలు అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్టు తెలిపారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోశాల వెంకన్న, కుల్ల యాకాంతం, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



రాయపర్తి : ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభాకర్, తదితరులు



గీసుకొండ : అవగాహన కల్పిస్తున్న తిరుమల, స్వప్న

రాయపర్తి : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని షేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జన్ను ప్రభాకర్, రాజేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రభాకర్, రాజేశ్ మాట్లాడారు. ఎక్కడైనా, ఎవరైనా బాల్యవివాహాలు తలపెడితే డయల్ 100, 1098లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రం కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు హెల్ప్ లైన్ 181కు ఫోన్ చేయాలని సూచించారు.

'కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న రాజు

నల్లబెల్లి : తప్పుడు అగ్రిమెంట్ పేపర్లతో భూమి విక్రయించి తన కుటుంబాన్ని మోసగిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడంటూ కాంగ్రెస్ పార్టీ నల్లబెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని మహేశ్‌పై ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని దివ్యాంగుడు నానబోయిన రాజు కోరాడు. అతడి తల్లి రాజమ్మతో కలిసి రాజు విలేకరులతో గురువారం మాట్లాడారు. తనకున్న 38 గుంటల భూమిని 2020లో మహేశ్ రూ.10.50 లక్షలకు అమ్మి డబ్బు తీసుకున్నట్లు తెలిపాడు. ఏడాది తరువాత మార్టిగేజ్ రుణం తీసుకున్నాడని, అప్పటి నుంచి రైతుబంధు డబ్బు సైతం తీసుకుంటున్నాడని వివరించారు. మహేశ్ మోసాలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారులను కోరాడు.

అటెన్షన్ ప్లీజ్



లీకేజీ.. నీటి వృథా

మండలంలోని ఏకేతండాలోని బోర్ పాయింట్ వద్ద పైపులైన్‌కు లీకేజీ చోటు చేసుకుని తాగు నీరు వృథా పోతోంది. పైపులైన్‌కు రెండుచోట్ల నుంచి నీరు వృథా పోతోందంటూ గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇకనైనా వెంటనే పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేయించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. - రాయపర్తి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
పెద్దూరి రోజా, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9154213848

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో డిసెంబర్ 1న నిర్వహించనున్న పోలీస్ కిష్టయ్య సంస్మరణ సభ వాల్‌పోస్టర్‌ను మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పోలీస్ కిష్టయ్య అమరుడయ్యాడని తెలిపారు. సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీనివాస్, భూమ సుధాకర్, నారెల్లి సుధాకర్, కొండ ఉప్పలయ్య, పిట్టల భాస్కర్, పిట్టల కుమారస్వామి, మట్టెపెల్లి సుభాశ్, సంగినేని భీమరాజు, సుంకరి శ్రీనివాస్, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు, అధికారులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుకుంటున్న 300 మంది విద్యార్థులకు ఉప్పరపల్లికి చెందిన కలామ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందె లావణ్య-యాదగిరి, మహ్మద్ నాజియా బేగం-హఫీజ్ సహకారంతో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్, ఎస్‌ఆర్‌ఐ అందె యాదగిరి మాట్లాడారు. ఏపీజే కలాంను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఏఈఓ సరళ, ఎస్సై రాజేశ్‌రెడ్డి, విద్యాలయ ప్రత్యేక అధికారి మిట్టపల్లి జ్యోతి, ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాషుమియా, పరికి మధూకర్, లీగల్ అడ్వైజర్ ఊడుగుల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలి

- 'గీతాంజలి' చైర్మన్ సుబ్బారావు

నర్సంపేట : విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు ఆకాంక్షించారు. పట్టణంలోని ఆ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికవగా వారిని ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సుబ్బారావు గురువారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఈనెల 26న హనుమకొండలో జరిగిన జిల్లాస్థాయి అండర్-8, 10, 12 కేటగిరీల్లో విద్యార్థులు భానుశ్రీ, యశ్వంత్, ఆరాధ్య, హర్షవర్ధన్, టినేశ్‌కుమార్, దేవాన్స్, జినేశ్‌కుమార్, కరుణి, శ్రీకా, మేఘన ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. డిసెంబర్ 1న జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీకి భానుశ్రీ, శ్రీక ఎంపికైనటుట్ల చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి, ఇన్‌చార్జ్ రాధ, వ్యాయామ ఉపాధ్యాయులు మహేశ్, రజిత తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌కు చెందిన వినయ్‌కుమార్, విష్ణు, లోకేశ్ రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. స్కూల్ ఆవరణలో సదరు విద్యార్థులను ఆయన గురువారం అభినందించి మాట్లాడారు. నర్సంపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. డిసెంబర్ 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసస్వామి, ఉప్పలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



వర్ధన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని బొంత కృతిక జిల్లాస్థాయి వ్యాస రచన పోటీలకు ఎంపికైంది. స్కూల్‌లో గురువారం మండలస్థాయి పోటీలు నిర్వహించగా కృతిక ప్రతిభ చాటి జిల్లాస్థాయికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని కృతికను హెచ్‌ఎం అనిల్, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధిపై వ్యాస రచన పోటీలు నిర్వహించగా కృతిక ప్రతిభ చాటిందన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌మోహన్, కల్యాణి పాల్గొన్నారు.